క్లుప్తంగా

భూసార పరీక్షలు తప్పనిసరి



మాట్లాడుతున్న శ్రీనాథ్‌రెడ్డి

పెద్దపప్పూరు: రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించాలని జిల్లా భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయ అధికారి శ్రీనాథ్‌రెడ్డి, ఏఓ ఆంజనేయులు సూచించారు. మండలంలోని సోమనపల్లిలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. పంటల సాగులో ఎలాంటి సందేహాలున్నా సమీపంలో ఉన్న రైతు సేవా కేంద్రంలోని అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జూటూరు పీఏసీఎస్ సీఈఓ మహ్మద్ రఫీ, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై అధికారులకు చిత్తశుద్ధి లేదు



తహసీల్దార్ రజాక్‌వలితో మాట్లాడుతున్న రైతు సంఘం కార్యదర్శి రాజారామిరెడ్డి, రైతులు

తాడిపత్రి: ప్రజా సమస్యల పరిష్కార వేదిక పేరిట ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరిస్తున్నారే తప్ప వాటికి పరిష్కారం చూపడంలో అధికారులకు చిత్తశుద్ధి లేదని తాడిపత్రి మండల రైతు సంఘం కార్యదర్శి రాజారామిరెడ్డి మండిపడ్డారు. సోమవారం ఆయన తహసీల్దార్ రజాక్‌వలికి గంగాదేవిపల్లి పొలం సర్వే నంబర్ 206లో రస్తా విషయమై రెండోమారు రైతులతో కలసి అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఆ గ్రామంలోని రస్తా విషయమై రెండు వారాల క్రితం అర్జీ ఇచ్చినా, ఇప్పటి వరకూ పరిష్కారం ఎందుకు చూపలేదని తహసీల్దార్‌ను ప్రశ్నించారు. కార్యక్రమంలో గంగాదేవిపల్లి రైతులు నరసింహారెడ్డి, శివశంకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రమేష్, గంగాశేఖర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, గంగన్న, ప్రసాద్, రత్నమయ్య, నాగలక్ష్మి పాల్గొన్నారు.

డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శిగా అశోక్ కుమార్



గుత్తి: డీవైఎఫ్‌ఐ (భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య) జిల్లా ఉపాధ్యక్షుడిగా గుత్తికి చెందిన అశోక్ కుమార్ ఎంపికైనట్లు సీపీఎం మండల కార్యదర్శి నిర్మల సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తానన్నారు. సీపీఎం నాయకులు, డీవైఎఫ్‌ఐ నాయకులు అతడిని అభినందించారు.

ఇండస్ట్రీ ఇంటర్న్‌షిప్‌పై విద్యార్థులకు అవగాహన



ఇంటర్న్ షిప్ విద్యార్థులతో గేట్స్ యాజమాన్యం, ఐరా కంపెనీ ప్రతినిధులు

గుత్తి: పట్టణ శివారులోని గేట్స్‌లో పాలిటెక్నిక్ విద్యార్థులకు సోమవారం ఇండస్ట్రీ ఇంటర్న్‌షిప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కంపెనీ ఐరా ఆటోమేషన్ సంస్థ సీఓ బాల సుబ్రమణ్యం, డైరెక్టర్ శ్రీ చందన విద్యార్థులకు పారిశ్రామిక అనుభవాల మధ్య అంతరాన్ని తగ్గించే ఇంటర్న్‌షిప్‌ను ఎలా పొందాలనే అంశంపై అవసరమైన మెలకువలను సూచించారు. ఆటో మేషిన్‌లోని తాజా ధోరణులు, నైపుణ్యత ఆధారిత శిక్షణ ప్రాముఖ్యత, కెరీర్‌పై చర్చించారు. అనంతరం గేట్స్ ఎండీ రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను వాస్తవ ప్రపంచ సవాళ్లకు సిద్ధం చేయడం, పరిశ్రమల నిపుణులుగా చేయడం ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో గేట్స్ కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ వాణి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ తన్వీర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణోత్సవం



అలంకరణలో లక్ష్మీ నరసింహస్వామి

తాడిపత్రి: మండలంలోని జంబులపాడు గ్రామంలో సోమవారం శ్రీదేవి, భూదేవి, సమేత లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. వేద మంత్రాలు మంగళ వాయిద్యాల మధ్య స్వామి, అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు., శ్రీదేవి, భూదేవి ఉత్సవ మూర్తులను అర్చకులు అలంకరించారు. ఉదయం 9.30 గంటలకు వేదమంత్రోచ్చారణల నడుమ స్వామి వారి కల్యాణోత్సవాన్నిభక్తుల సమక్షంలో అర్చకులు జరిపించారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలను అర్చకుడు మురళీ క్రిష్ణ అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కల్యాణోత్సవానికి భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు.



ఓల్డ్ సీఐ బంగ్లా వద్ద చేతికందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్



శాంతిప్రియ ఆస్పత్రి ఎదుట ఇలా..



ఓల్డ్ సీపీఐ కాలనీలో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

యమ డేంజర్!

- ప్రమాదరకంగా ట్రాన్స్‌ఫార్మర్లు
- భయందోళనలో ప్రజలు

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కనీసం కంచె కూడా ఏర్పాటు చేయలేదు. గతంలో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద చాలా విద్యుత్ ప్రమాదాలు జరిగాయి. పశువులు, కుక్కలు, పందుల వంటి జంతువులు షాక్‌కు గురవడంతో పాటు ఉప్పర వీధిలో కాగితాలు ఏరేందుకు ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లిన రంగస్వామి అనే వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడ్డాడు. ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కంచె ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కంచె ఏర్పాటు చేయిస్తాం



ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు చేయిస్తాం. త్వరలోనే కంచె ఏర్పాటు చేయడంతో పాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయిస్తాం. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.

– సాయి శంకర్, ఏడీఈ, ఏపీఎస్‌పీడీసీఎల్, గుత్తి



చర్చి రోడ్డులో తక్కువ ఎత్తులో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

మహిళలంటే గౌరవం లేదా ?

బుక్కరాయసముద్రం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళల అంటే గౌరవం లేకుండా పోయిందని వైఎస్సార్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు, జెడ్పీటీసీ భాస్కర్, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు, సర్పంచ్ పార్వతి మండిపడ్డారు. సోమవారం మండల కేంద్రంలోని సహకార సంఘం సొసైటీ కార్యాలయం ఎదుట ఉన్న మహానేత వైఎస్సార్ విగ్రహం ఎదుట వారు మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలపై దాడులు, అత్యాచారాలు, దోపిడీలు పెరిగిపోయాయన్నారు. చిలకలూరి పేట ఇన్‌చార్జి, మాజీ మంత్రి విడుదల రజని కారులో వస్తుండగా .. వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి అరెస్ట్ విషయంలో పోలీసులు మాజీ మంత్రి కారును అడ్డగించి, ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కనుసన్నల్లోనే ఇలా జరుగుతున్నాయని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రజలు అన్నీ గమనిస్తున్నారని కూటమి ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో చెదుల్ల సర్పంచ్ శ్రీనివాస రెడ్డి, దయ్యాలకుంటపల్లి ఎంపీటీసీ శివారెడ్డి, నాయకులు బయపరెడ్డి, సత్య నారాయణ, పూల రవి, రమేష్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ భాస్కర్, సర్పంచ్ పార్వతి

వైభవంగా సత్యనారాయణస్వామి వ్రతం



తాడిపత్రిలో పూజలందుకుంటున్న సత్యనారాయణస్వామి



యాడికిలోని అమ్మవారిశాలలో వ్రతాలు నిర్వహిస్తున్న ఆర్యవైశ్య మహిళలు

తాడిపత్రి రూరల్/యాడికి: తాడిపత్రి పట్టణంలోని వాటర్‌వర్క్స్ రోడ్డులో ఉన్న మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠంలో సోమవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం మహిళలు వైభవంగా నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకుని సత్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అంతకుముందు మఠంలో శ్రీ రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే లలితాదేవి ఆలయంలో అమ్మవారిని అర్చకులు వివిధ రకాల పూలతో అలంకరించి పూజలు జరిపారు. అదేవిధంగా యాడికి మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో సత్యనారాయణ వ్రతాన్ని ఆర్యవైశ్య మహిళలు వైభవంగా నిర్వహించారు.

ముగిసిన వాసవీదేవి జయంత్యుత్సవాలు





వాసవీ దేవి హోమం నిర్వహిస్తున్న పండితులు, కోటి కుంకుమార్చనలో పాల్గొన్న ఆర్యవైశ్య మహిళలు

గుంతకల్లు: స్థానిక కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో ఆరురోజులుగా జరుగుతున్న వాసవీ జయంత్యుత్సవాలు సోమవారం వైభవంగా ముగిశాయి. చివరి రోజు వాసవీ మాత విగ్రహ ప్రతిష్ఠ 64వ మహోత్సవ సందర్భంగా ఆలయంలోని మండపంలో ఆర్యవైశ్య మహిళలచే వేదపడింతులు, అర్చకుల నేతృత్వంలో కోటి కుంకుమార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వాసవీ హోమం, పూర్ణహుతి, కలశోద్వాసన, ఆలయ సంప్రోక్షణ కార్యక్రమ అనంతరం మహామంగళ హారతి గావించారు. అలాగే ఊరువిందు ఏర్పాటు చేశారు. సాయంత్రం వాసవీ దేవి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో కొలువుదీర్చి పట్టణంలో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్యవైశ్య మహిళ మండలి సభ్యుల డ్రమ్స్, వాయిద్య కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గోపా జగదీష్, కుందూరి కృపాకర్, కోశధికారి మేడం వెంకటేశ్వర్లు, పూజా కమిటి చైర్మెన్ పరుచూరి సత్యరంగయ్య, సభ్యులు జయంతి వెంకట్, ఇనుగూరు సుబ్బయ్య, ఆకుల కూమార్, చక్క జగన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామంలో 67వ నంబర్ జాతీయ రహదారి పక్కనున్న లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి స్వామికి విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, రక్షా బంధనం, పంచామృతాభిషేకం, తులసి పత్రి పూజ, హోమం తదితర పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. గ్రామంలో స్వామికి సమర్పించే పట్టు వస్త్రాలు, ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. మహిళలు ఒడి బియ్యం సమర్పించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు చేశారు. అనంతరం వీర బ్రహ్మేంద్రస్వామి ఆరాధన, బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు.



అలంకరణలో వేంకటేశ్వరస్వామి

వజ్రగిరి క్షేత్రంలో ఘనంగా తిరునాల

పెద్దపప్పూరు: వైశాఖమాసం పౌర్ణమి సందర్భంగా మండలంలోని తిమ్మనచెరువు కొండపై వెలసిన వజ్రగిరిస్వామి క్షేత్రంలో సోమవారం తిరునాల ఘనంగా నిర్వహించారు. తిరుపతి వేద పండితులు శ్రీదేవి, భూదేవి, నరసింహస్వాములను పట్టు వస్త్రాలతో అలంకరించి కల్యాణమండపానికి ఊరేగింపుగా తీసుకువచ్చి కల్యాణోత్సవం నిర్వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక నుంచి భక్తులు తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలతోపాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ బందోబస్తు ఏర్పాటుచేశారు. అలాగే మండలంలోని అశ్వత్థ నారాయణస్వామి క్షేత్రంలో పౌర్ణమి సందర్భంగా స్వామి వారి కళ్యాణం నిర్వహించి ఉత్సవమూర్తులను ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు.



అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామి

సంక్షిప్త సమాచారం

‘డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయండి’

శింగనమల: నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యప్రకాష్ కోరారు. గార్లదిన్నెలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల ప్రజా వేదికలో కలెక్టర్ వినోద్‌కుమార్‌కు ఆయన వినతి పత్రం అందజేశారు. అలాగే శింగనమలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైన్స్ గ్రూపులు ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు తరిమెల గిరి, విజయ్‌కుమార్, సాయి, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకు స్థాపన

యాడికి: మండలంలోని నిట్టూరు గ్రామం వద్ద ఆదివారం బుగ్గ, రాయల చెరువు రోడ్డుకు తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.4 కోట్ల నాబార్డు నిధుల ద్వారా తాడిపత్రి మండలంలోని బుగ్గ, యాడికి మండలంలోని రాయల చెరువు గ్రామాల వరకూ రోడ్డు నిర్మాణం అవుతుందన్నారు. ఈ రోడ్డు నిర్మాణం వల్ల అనంతపురం, నంద్యాల జిల్లా ప్రజలకు ప్రయాణం సులభమవుతుందన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పామిడి: పామిడి సమీపంలోని పెన్నానది నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్ల యజమానులపై సీఐ వీ యుగంధర్ కేసు నమోదు చేశారు. నిందితులను ఇన్‌చార్జ్ తహసీల్దార్ జీ లక్ష్మీనారాయణరెడ్డి ఎదుట హాజరు పరిచారు.

ఘనంగా నర్సుల దినోత్సవం

పామిడి: పట్టణంలోని కమ్యూనిటీ ఆస్పత్రిలో పామిడి యువత ఆధ్వర్యంలో సోమవారం నర్సుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నర్సుల ప్రాముఖ్యతను వారు వివరించారు. అనంతరం నర్సులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో శరత్, జగదీష్, వడ్డే రాము, కత్రిమల సుబ్బు, లాయర్ సతీష్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో ఐదుగురి అరెస్ట్

పామిడి: పట్టణంలోని మార్కెట్‌వీధికి చెందిన శివ, శేఖర్, మరో ముగ్గురిని స్థానిక మొండి బాలరాజుపై దాడి కేసులో అరెస్ట్ చేసినట్లు సీఐ వీ యుగంధర్ సోమవారం తెలిపారు. ఈ నెల 7న పందుల కోసం గొడవ విషయంలో శివ, శేఖర్ బృందం బాలరాజుపై కత్తులతో దాడి చేసి గాయపరచిన విషయం తెలిసిందే. అనంతపురం సర్వజనాసుపత్రి వద్ద వైద్య చేయించు కోవడానికి వచ్చిన శివ, శేఖర్ బృందాన్ని అదుపులోనికి తీసుకున్నట్లు సీఐ తెలిపారు.

రక్త నమూనాల సేకరణ

యాడికి: మండలంలోని పెద్దపేట గ్రామంలో సోమవారం యాడికి వైద్యాధికారి పరమేశ్వర్, తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు ఫైలేరియా రక్తపూతల నమూనా రాండం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాడికి మండలంలోని ప్రాథమిక ఆరోగ్య సిబ్బందిని ఆరు జట్లుగా విభజించి మొత్తం 302 మంది రక్త నమూనాలు సేకరించామన్నారు. అనంతరం గ్రామస్తులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రోటరీపురంలో అక్కమ్మ గార్ల పరుష



అలంకరణలో అక్క దేవతలు

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని రోటరీపురం గ్రామంలో సోమవారం అక్కమ్మ గార్ల పరుష వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కమ్మ గార్ల దేవాలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. తెల్లవారుజాము 4 గంటలకు కొత్తబావి నుంచి జలధికి స్వాములను తీసుకెళ్లారు. ఆలయం ఎదుట ఉదయం 7 గంటలకు గంగపూజ, నవగ్రహ పూజ, స్వస్తి వాచనం, పుణ్యవాచనం నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు జలధి నుంచి అక్కమ్మ గార్ల స్వాములను గ్రామంలో ఉరుములతో ఊరేగించారు. అలాగే ఆలయం ఎదుట అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

జోహార్ మురళి నాయక్



మురళి నాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు, అధ్యాపకులు

గుంతకల్లుటౌన్: భారత్–పాకిస్థాన్ మధ్య జరిగిన యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్ మురళి నాయక్ ఆశయాల సాధనకు పాటుపడదామని ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మయ్య, ఎన్‌సీసీ అధికారి బాలకృష్ణ తెలిపారు. సోమవారం కళాశాల ఎన్‌సీసీ ఆధ్వర్యంలో మురళి నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాగరాజు, రాఘవేంద్ర, ప్రసాద్, అల్తాఫ్, బసవరాజు, మల్లేష్, వనజమ్మ, అశోక్, జాకీర్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ భ్రమరాంబ దేవి

గార్లదిన్నె: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ భ్రమరాంబ దేవి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని డీఎంహెచ్‌ఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె పీహెచ్‌సీలో ఓపీ రిజిస్టర్, ఎల్రక్టానిక్ హెల్త్ రికార్డు, యాప్ అప్‌లోడ్, సేఫ్ డెలివరీ గది పరిశీలించారు. అలాగే ప్రజలకు వడదెబ్బ తగలకుండా తీసుకునే జాగ్రత్తలపై వైద్య సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధులు, వెక్టర్ బోర్న్ వ్యాధుల గురించి . ప్రతి బుధవారం నీటి పరీక్ష, ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం, టీబీ, కుష్టు వ్యాధి నిర్ధారణ కార్యక్రమాలు తప్పకుండా నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విజ్ఞానం పెంపొందించుకోవాలి



విజ్ఞాన శిబిరాన్ని పరిశీలిస్తున్న రమ

గార్లదిన్నె: విద్యార్థులు పుస్తకాలు చదివి విజ్ఞానం పెంపొందించుకోవాలని గ్రంథాలయ సంస్థ కార్య దర్శి రమ సూచించారు. గార్లదిన్నె గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు రోజూ గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదువుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులచే కథలు చదవడం, పొడుపు కథలు చెప్పించడం, క్యారమ్స్, చెస్, స్నేక్ అండ్ లాండర్ తదితర ఆటలు ఆడించారు. గ్రంథాలయాధికారి శిరీష తదితరులు పాల్గొన్నారు.

కంపు.. కంపు



పోలీస్‌స్టేషన్ సర్కిల్‌లోని మున్సిపాలిటీ మరుగుదొడ్లు

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సర్కిల్ సమీపంలో ఉన్న మున్సిపాలిటీ మరుగుదొడ్ల పరిసరాలు కంపు కొడుతున్నాయి.. తాడిపతి పట్టణానికి ప్రధాన సర్కిల్ కావడంతో పలు గ్రామాల నుంచి వచ్చే ప్రజలతోపాటు దుకాణ యజమానులకు మూత్ర విసర్జనకు ఇవి తప్పా మరో మార్గం లేదు. దీంతో రోజూ వీటిని పెద్ద సంఖ్యలో వినియోగిస్తుంటారు. మరుగుదొడ్ల శుభ్రం చేయడానికి నిర్వాహకులు ఫినాయిల్, యాసిడ్ వినియోగించకపోవడంతో.. ఆ సమీపంలోకి వెళ్తే ముక్కుపుటలు అదిరేలా దుర్వాసన వెదజల్లుతోంది. అధికారులు స్పందించి మరుగుదొడ్లు శుభ్రం చేయించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

లీకేజీని అరికట్టరూ..



పైపులైను లీకేజీ వల్ల రోడ్డుపై నిలిచిన నీరు

పెద్దపప్పూరు: మండలంలోని గార్లదిన్నెలో సత్యసాయి తాగునీటి వాటర్ ట్యాంక్ సమీపంలో పైపులైను పగిలిపోవడంతో నీరు లీకేజీ అవుతూ వృథా అవుతోంది. అసలే వేసవికాలం తాగునీరు వృథా కావడమే గాక రోడ్డుపై నీరు నిలబడడంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే నీరు కలుషితమై ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉంది. లీకేజీ అవుతున్న పైపులైన్ సత్యసాయి తాగునీటి పథకానికి సంబంధించినదా లేక పంచాయతీకి సంబంధించిందా అన్నవిషయం అధికారులకే తెలియాల్సి ఉంది. అధికారులు స్పందించి నీటి లీకేజీని అరికట్టాలని గ్రామస్తులు కోరారు.